ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 20 జనవరి 2024

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్ - 8లో..

వంద రోజుల్లో
ఆరు గ్యారెంటీల అమలు - 8లో..



విద్యా కమిటీల ఎన్నికలకు మోక్షం

- కొత్త ప్రభుత్వంలో కదలిక
- నాలుగేళ్ల తరువాత సందడి
- ఈ నెల 29న ఎన్నికలు
- నేడు నోటిఫికేషన్ జారీ
- పావులు కదుపుతున్న రాజకీయ పార్టీల నేతలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ సందడి మొదలైంది. నాలుగేళ్ల తర్వాత కొత్త ప్రభుత్వం విద్యా కమిటీల ఎన్నికలకు శనివారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆధిపత్యం నిరూపించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మరోవైపు విద్యాకమిటీల ఎన్నికలతో వారం రోజులపాటు పాఠశాల వేదికగా రాజకీయ కోలహాలం కనిపించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో బలోపేతం చేసే దిశగా ప్రభుత్వ విద్యా కమిటీల నియామకాలను చేపట్టింది. విద్యా రంగంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగ పరచడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాల్సిన విద్యా కమిటీలకు రేండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

గత ప్రభుత్వం నాలుగేళ్ల గడిచినా ఎన్నికల నిర్వహణను పట్టించుకోలేదు. పాఠశాలల కమిటీల్లో ఉన్న సభ్యుల పిల్లలు కళాశాల స్థాయికి వెళ్లడం, మరికొందరు స్కూళ్లు మారినా వారే కమిటీలుగా కొనసాగుతున్న తీరు ఉంది. చివరిసారిగా విద్యా కమిటీలకు 2019లో ఎన్నికలు నిర్వహించారు. రెండేళ్ల గడిచిన తరువాత ఆరు నెలల చొప్పున విద్యా కమిటీల కాలాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. తరువాత ప్రతినెలా పొడిగిస్తున్నారు. గత నెలలోనూ విద్యా శాఖ కమిషనర్ పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో విద్యా కమిటీలు నామ మాత్రంగా పని చేయడంతో పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను తప్పకుండా ఏర్పాటు చేయాలనే నిబంధనను పెట్టారు. ప్రతి నెలా కమిటీ సభ్యులు సమావేశమై స్కూల్ మౌలిక సదుపాయాలు, టీచర్ పోస్టుల ఖాళీలు, విద్యార్థుల ప్రగతి ఇతర సమస్యలను చర్చించాల్సి ఉంటుంది. ఇవేమి జరగకుండానే కమిటీలు మొక్కుబడిగానే పనిచేశాయనే విమర్శలు ఉన్నాయి.

కొత్త ప్రభుత్వంలో కమిటీలు

గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యా కమిటీలకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 29న పాఠశాలలతోపాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో కొత్త కమిటీలను ఎన్నుకోవడానికి శనివారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నోటిఫికేషన్‌తోపాటు పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు వెల్లడిస్తారు. 22, 23 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 24న తుది పేరెంట్స్ జాబితా వెల్లడిస్తారు. 29న ఎస్ఎంసీ కొత్త కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో ఎన్నుకుంటారు.

జిల్లాలో 534 పాఠశాలలు

జిల్లాలో 510 సాధారణ పాఠశాలలు, ఏడు మోడల్ స్కూల్‌లు, 13 కస్తూర్బా, అర్బన్ రెసిడెన్షియల్, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 49,766 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో ఒకటి నుంచి 8వ తరగతికి సంబంధించిన విద్యార్థులు 36,247 మంది ఉన్నారు.

ఈ విద్యార్థులకు సంబంధించిన తల్లిదండ్రులకే విద్యా కమిటీల్లో పోటీ చేసే అవకాశం, ఎన్నుకునే అవకాశం ఉంటుంది. విద్యా కమిటీల్లో ఆ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా స్థానిక సంస్థల నుంచి ఎన్నుకుంటారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. కమిటీ సభ్యుల్లో నాలుగు భాగాల్లో మూడోవంతు మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఉండాలి. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున పిల్లల తల్లిదండ్రులను కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు.

ఇందులో జనరల్ కేటగిరీలో ఒకరు, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒకరు, బీసీ మైనార్టీ నుంచి ఒకరు ఉంటారు. ఎన్నుకునే సభ్యుల్లో ఇద్దరు మహిళలు ఉంటారు. ఎన్నుకునే సమయంలో 50 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలి. ఎన్నుకున్న కమిటీ పాఠశాలల పర్యవేక్షణ, మధ్యాహ్న భోజన పథకం, అల్పాహారం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు, ఉత్తీర్ణత శాతం పెంచే సూచనలు వంటి వాటిల్లో కీలకంగా పని చేస్తారు.

రాజకీయ సందడి

జిల్లాలోని పాఠశాలల్లో విద్యా కమిటీల్లో ఇప్పటి వరకు బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఆ పార్టీల నాయకులు కూడా ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన తొలి విద్యా కమిటీ ఎన్నికల్లో తమ వారే ప్రాతినిధ్యం వహించే విధంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. శుక్రవారం నుంచే పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఎవరెవరూ ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని పాఠశాలల్లో కాంగ్రెస్‌కు చెందిన వారినే ఎన్నుకునే విధంగా అయా గ్రామాల్లోని పార్టీ నాయకులు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉండడం ప్రభుత్వానికి చెందిన వారిగా కాంగ్రెస్ నాయకులు ఉండడంతో పాఠశాలల్లో వారం రోజుల పాటు రాజకీయ సందడి కొనసాగుతుందని భావిస్తున్నారు.



ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి

ఇల్లంతకుంట, జనవరి 19: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్యం అందుతుందనే విశ్వాసం ప్రజలకు కల్పించాలని అన్నారు. సుఖ ప్రసవాలయ్యేలా చూడాలన్నారు. క్రమం తప్పకుండా టీకాలు వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని, ఆన్‌లైన్ చేయాలని అన్నారు. పెద్దలింగాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శరణ్య, కట్ట రమేష్, శరణ్య, సీహెచ్ఓ బాలచంద్రం, సూపర్‌వైజర్లు జవహర్, నయిం, లలితాదేవి పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, జనవరి 19: క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు లభిస్తోందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండపరిషత్ కార్యాలయంలో శుక్రవారం రేపాక వాలీబాల్ క్రీడాకారులను అభినందించారు. రేపాక జట్టు జిల్లాస్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. యువకులు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆటలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఎంపీటీసీలు కాథ సుమలతమల్లేశం, దొమ్మాటి కిషోర్‌గౌడ్, స్రవంతిరమేష్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 19: ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదుకు అర్హులని పేర్కొన్నారు. అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరుజాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు పనిచేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో సమయ పాలనను పాటించాలని, నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6, 7, 8, ఫారాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

సెకండ్ సమ్మరీ రివిజన్‌పై వీడియో కాన్ఫరెన్స్

సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం రాత్రి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటరు నమోదు, వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి కొత్త ఓటరు కార్డులను ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఓటరు నమోదు జాబితాల్లో తప్పుల సవరణకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, ఆర్డీవోలు అనంద్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సీఎంఆర్ బియ్యం అందించకుంటే జరిమానా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 19: సీఎంఆర్ బియ్యాన్ని 12 రోజుల్లో అందించకుంటే రైస్ మిల్లర్లకు జరిమానా విధిస్తామని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శుక్రవారం సీఎంఆర్ బియ్యం సరఫరాపై జిల్లాలోని రైస్‌మిల్లర్ల యాజమాన్యాలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఖరీఫ్ 2022-23 సీజన్ సీఎంఆర్ బియ్యాన్ని 12 రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వకపోతే జరిమానా విధిస్తామని, నిబంధనలు ఉల్లఘించే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని అన్నారు. సీఎంఆర్ బియ్యం రవాణాలో ఇబ్బందులు ఉంటే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రైస్ మిల్లులో బియ్యం పట్టించి తరలింపును పర్యవేక్షించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, రైస్‌మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిరిసిల్ల క్రైం, జనవరి 19: క్రీడలు న్యాయవాదులకు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని బార్ అసోసి యేషన్ అధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల్లో భాగంగా క్యారమ్స్ షోమ్యాచ్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు తప్పనిసరిగా వాకింగ్ చేయాలన్నారు. క్రీడలపై న్యాయవాదులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, న్యాయవాది అనిల, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, న్యాయవాది కళ్యాణి డబుల్స్ క్యారమ్స్ షోమ్యాచ్ ఆడారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటెన్, చెస్, క్యారమ్స్, ఇతర స్కిల్ గ్రేమ్స్, క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, కార్యదర్శి అనిల్, క్రీడల కార్యదర్శి గుడ్ల కిషన్, పీపీ లు, ఏపీపీలు, ఏజీపీలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా దివ్య

సిరిసిల్ల క్రైం, జనవరి 19: సిరిసిల్ల పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది గుడ్ల జ్యోతికిరణ్ కూతురు దివ్యను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి ఉత్తర్వులు జారీచేశారు. దివ్య నియామకకంపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గుడ్ల రవి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ప్రభుత్వ న్యాయవాదిగా ఒక్కరినే నియమించడం గర్వకారణమన్నారు.

మహిళల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

ఇల్లంతకుంట, జనవరి 19: మహిళల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ రోజ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాలిపెల్లి, వల్లంపట్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. వేధింపులకు గురైన మహిళలకు చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలకు సఖి కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్య న్యాయ సేవలపై వివరించారు. కార్యక్రమంలో సఖిసెంటర్ కోఆర్డినేటర్ విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలేఖ, చైల్డ్‌హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్, సాధికారిక కౌన్సిలర్ దేవిక, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయులు వంశీ, పావని, రేఖ పాల్గొన్నారు.

విద్యార్థులే నవ సమాజ నిర్మాతలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 19: విద్యార్థులే నవ సమాజ నిర్మాతలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి మోహన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన శీతాకాల శిబిరం ముగింపు కార్యక్రమానికి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐఈవో మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలన్నారు. అంతకు ముందు గ్రామ పుర వీధుల గుండా మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పర్శరాములు, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

సిరిసిల్ల రూరల్, జనవరి 19 : కార్పొరేట్ బ్యాంకుల్లో కొలువుల భర్తీకోసం ప్రదీప్తి పౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని మహితి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నుంచి సుమారు 200లకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. మూడు దశల్లో స్క్రీనింగ్ చేసి 69 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ నెల 22 తరువాత శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించి శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఏక్సిస్ బ్యాంక్ డెవలప్‌మెంట్ మేనేజర్ వినయ్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను మహతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.రాజు, ప్రదీప్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రిన్సిపాల్ గెంట్యాల భూమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకుల ప్రతినిధులు ప్రణయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నాగరం చెరువు పరిశీలన

రుద్రంగి, జనవరి 19: రుద్రంగి మండల కేంద్రం శివారులోని నాగరం చెరువును ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఆధికారులు శుక్రవారం పరిశీలించారు. గురువారం రుద్రంగి గ్రామ పంచాయతీ వద్ద ప్రజలతో ఆది శ్రీనివాస్ మాటమంతీ కార్యక్రమంలో నాగరం చెరువు తూమ్ వద్ద నీరు లీక్ అవుతోందని రైతులు వివరించారు. దీంతో ఇరిగేషన్ ఆధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. స్పందించిన ఆధికారులు శుక్రవారం రైతులతో కలిసి ఇరిగేషన్ ఆధికారులు నాగరం చెరువు తూమ్‌ను పరిశీలించి తూమ్ మరమ్మతు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సుమంత్ రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

వీర్నపల్లి, జనవరి 19 : వీర్నపల్లి మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జిల్లెల్ల రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది ఎస్సైకి శుభా కాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై నవత జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీపై వెళ్లారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల ఎస్సైగా ప్రశాంత్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణే ధ్యేయంగా పని చేస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సైని మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు.

చందుర్తి: చందుర్తి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చందుర్తి ఎస్సైగా పనిచేసిన అశోక్ రుద్రంగికి బదిలీపై వెళ్లారు. తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఎస్సై వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చారు.

ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- శివరాత్రి జాతర ఏర్పాట్లు, వేములవాడ అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీటీడీఏ, దేవస్థానం, మున్సిపాలిటీ అభివృద్ధి పనులతో పాటు 'నా పంట' పేరుతో రూపొందించిన మొబైల్ ఆధారిత అప్లికేషన్ పనితీరు, కేజ్ కల్చర్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో సమ్మక్క సారలమ్మ జాతర దృష్ట్యా రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల తాకిడి ఇప్పటికే పెరిగిందన్నారు. మార్చి మొదటి వారంలో మహా శివరాత్రి నేపథ్యంలో మున్సిపాలిటీ, వీటీడీఏ పరిధిలోని పెండింగ్ పనులను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తున్న భావన ప్రజల్లో కల్పించాలన్నారు. జనవరి మొదటి వారం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు వస్తున్నారని, షిఫ్టుల వారీగా సానిటేషన్ సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. అంతకుముందు శివరాత్రి జాతరకు ముందే వేములవాడ గుడి చెరువు అభివృద్ధి సుందరీకరణ పనులు 80 శాతం పూర్తయినట్లు అధికారులు వివరించారు.

శివరాత్రి జాతరకు పకడ్బందీ కార్యాచరణ

శివరాత్రి జాతరను సజావుగా నిర్వహించేందుకు పగడ్బందీ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆది శ్రీనివాస్ అన్నారు. శివార్చన స్టేజీని శివరాత్రి లోగా సిద్ధం చేయాలన్నారు. భక్తులు సులభంగా, వేగంగా దర్శనం చేసుకునేందుకు వీలుగా మూడు క్యూ లైన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీలతో సాధారణ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా బ్రేకు దర్శనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే ఆదివారం నుంచి 24 గంటలు క్యూ లైన్‌లను మానిటర్ చేయాలన్నారు. ఆలయంలో నాలుగు విభాగాలుగా చేసుకోవాలని, శానిటేషన్ మూడు షిఫ్టుల్లో 24 గంటలు పనులు చేపట్టాలని అన్నారు. ధర్మగుండంలో నీటి శుద్ధి కోసం చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే మంజూరైన రూ.5 కోట్లతో వేములవాడ పట్టణంలోని సినారే ఆడిటోరియం ఆధునికీకరణపై ఆర్అండ్‌బీ అధికారులు అధ్యయనం చేసి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలన్నారు. వేములవాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయినందున ఇతర పెండింగ్ పనులపై దృష్టిసారించాలని, ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వేములవాడ - వట్టెంల రోడ్డు, వేములవాడ - కోరుట్ల రోడ్డు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. మూలవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన పనులను వర్షాకాలంలోగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్, జవహర్ లాల్ నెహ్రూ మార్కెట్, మూలవాగు చిల్డ్రన్స్ పార్కు వద్ద వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించాలని, ముందుకు వచ్చే వ్యాపారులకు శ్యామకుంట మార్కెట్‌లో విక్రయాలు చేసుకునేందుకు స్థలాలను కేటాయించాలని సూచించారు. ముంపు గ్రామాల్లో జీవన ఉపాధి కల్పనకు ప్రణాళికలు ముంపు గ్రామాల్లోని ప్రజల జీవనోపాధుల కల్పనకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ముంపు గ్రామాల్లోని మత్స్యకారులకు కేజ్ కల్చర్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేజ్ కల్చర్‌తో కలిగే ఆర్థిక ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాలన్నారు. ఊరికి ఇద్దరు మత్స్యకారులను నల్గొండ, ఖమ్మం జిల్లాల విజిట్‌కు తీసుకెళ్లాలన్నారు. వారికి యూనిట్‌లను మంజూరు చేయాలన్నారు. జిల్లాలో పంట విత్తే నాటి నుంచి కోతకు వచ్చి విక్రయించే దశ వరకు వరి పంట ఉత్పాదకతకు క్వాలిటీకి 'నా పంట' అనే మొబైల్ ఫ్లాట్‌ఫాం అన్ని విధాలుగా అనువుగా ఉన్నందున ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎగువ మానేరు డ్యాం కింద 13 వేల ఎకరాల అయకట్టు సాగుకు 10 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతున్న దృష్ట్యా మిగతా 3 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత వర్షాకాలంలో జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువుల మరమ్మతుల కోసం అనుమతులు, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

శివరాత్రి జాతర, సమ్మక్క సారలమ్మ జాతర దృష్ట్యా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. భక్తులకు తగినన్ని మరుగు దొడ్లు, డ్రెస్సింగ్ రూమ్‌లు పెంచడం, మంచినీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మూలవాగు బండ్ పార్క్, పర్యాటక అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గౌతమి, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఈఈ సూర్య ప్రకాశ్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, ఆర్అండ్‌బీ ఈఈ శ్యామ్ సుందర్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, ఇంట్రా ఈఈ జానకి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, వేములవాడ మున్సిపల్ కమీషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేష్, పర్యాటక శాఖ డీఈఈ సుదర్శన్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో సెస్ కార్యాలయం

- పెచ్చులు ఊడుతున్న వైనం - పట్టించుకోవాలని విజ్ఞప్తి



శిథిలావస్థకు చేరిన గంభీరావుపేట సెస్ కార్యాలయం

గంభీరావుపేట, జనవరి 19 : గంభీరావుపేట మండల కేంద్రంలోని సెస్ కార్యాలయం శిథిలావస్థకు చేరుతోంది. భవనం పైపెచ్చులు ఊడుతుండడంతో ప్రమాదకరంగా మారుతోంది. వర్షాకాలంలో గదులన్నీ ఉరుస్తున్నాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్ల కిందట భవనం నిర్మించారు. దీంతో శిథిలావస్థలో ఉంది. సెస్ కార్యాలయంలోని ఉన్న 4 గదులు అదే పరిస్థితిలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపారు. దాదాపు రూ .40 లక్షల అంచనాలతో ప్రతి పాదనలు సిద్ధం చేసి పంపించారు. ప్రతిపాదనలు పంపించి 6 నెలలు గడిచినా ప్రయోజనం లేదు. సెస్ కొత్త భవనం నిర్మించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



- నారాయణరావు, సెస్ డైరెక్టర్

గంభీరావుపేట సెస్ కార్యాలయం పరిస్థితిని గత ప్రభుత్వ హయాంలోనే వివరించాం. అప్పుడే ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు పంపించాం. వానొస్తే కార్యాలంయంలో ఉండడం ఇబ్బందిగా ఉంటుంది. భవనం లోపల వైపు పెచ్చులు ఊడుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా కొత్త భవనం నిర్మాణం కోసం కృషి చేస్తా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను విస్తృ తంగా తనిఖీ చేస్తున్నట్లు వ్యవసా యాధికారి వైదేహి తలిపారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంతో పాటు పెర్కపల్లి, ఆకునూర్, ఎల్లంపల్లి గ్రామాలలో వ్యవసాయాధికారి వైదే హి ఎరువుల దుకాణాలు తనిఖీ చేయడంతో పాటు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతీ రోజు కొన్ని షాపులను ఎంచుకొని వాటిలో రికార్డులను పరిశీలస్తున్నామన్నారు. డీలర్లు ఎపోస్ మిషన్‌కు స్టాక్ రిజిష్టర్ గ్రౌండ్ బ్యాలన్స్ తో సరి పోతుందా లేదా అనిపరిశీలిస్తున్నామని చెప్పారు. ఎరువుల విక్రయాలు తప్పని సరిగా ఎపోస్ మిషన్ ద్వారానే చేయాలనిన్నారు. ఈ యాసంగి సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా స్టాక్ ఎప్పిటికప్పుడు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తనిఖీలలో రికార్డుల సక్రమంగా లేనట్లు తేలితే షాపుల లైసన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. షాపుల పరిశీలనతో పాటు ప్రతీ రోజు పంటలను పరిశీలస్తున్నామని వివరించారు. చీడ పీడల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి

మానకొండూర్, జనవరి 19: మానకొండూర్ గ్రామానికి చెందిన సుహన్ అనే బాలుడు శుక్రవారం పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనూష నవీన్ దంపతుల కుమారుడు సుహాన్(3) ఏళ్ల బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది.. బాలుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమంచి బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



సుహాన్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల కేంద్రంలో జీపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్కేపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్, రజినీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు సైదాపూర్ పాత బస్టాండ్ మీదుగా దుద్దెనపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన జీపు ఆ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. కింద పడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళా గురుకులంలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్

జగిత్యాలరూరల్, జనవవరి 19: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల సాంఘిక సంక్షేమ శాఖ మహిళా గురుకుల కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 20న మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించనునన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గోలి శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 టీఎస్ ఎంసెట్ (బైపీసీ)లో అర్హత సాధించినవారు అర్హులని ఆసక్తికలవారు అన్ని ధ్రువపత్రాలు ఒరిజనల్ జిరాక్స్ ప్రతులతో హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలన్నారు. వివరాలకు కళాశాలలో 8142747880లో సంప్రదించాలని కోరారు

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి

● అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు

వేములవాడ, జనవరి 19: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురా సుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ. కళాభవన్లో శ్రీస్వామివారి నిత్యకళ్యాణం, సత్యనారా యణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో లఘు దర్శనం అమలు చేశారు. దీంతో భక్తు లు నందీశ్వరుడి విగ్రహం వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించు కున్నారు. అనుబంద ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆల యంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తుల కు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

ధర్మపురిలో రెండో రోజు

వేద పారాయణం

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారా యణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండో రోజూ 21 మంది వేదపండితులు రుగ్వేద హవనం, సామవేద పారాయణం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు, స్థానిక వేదబ్రాహ్మణులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడ వేదపం డితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, ఆలయ ఉపప్రదాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

పాస్‌పోర్ట్ ఏజెంట్ల ఇళ్లలో సీబీఐ సోదాలు

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు



పాస్ పోర్ట్ ఏజెంట్ ఇంటి వద్ద సీబీఐ అధికారులు

కోరుట్ల, జనవరి 19: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లపై సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. కోరుట్ల పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆశోక్, ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న చాంద్ పాషా (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), రతాల పంపు ప్రాంతంలో ఉంటున్న కమర్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లలో అధికారులు సోదాలు జరిపారు. నాలుగు బృందాలుగా విడిపోయిన సీబీఐ అధికారులు ఏకకాలంలో వారి వారి ఇళ్లలో సోదా చేసి ఇంట్లో ఉన్న నకిలీ నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, వివిధ అధికారుల హోదాతో ఉన్న స్టాంప్‌లతో పాటు ల్యాప్ టాపులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిసింది. అశోక్ రావు, కమర్‌ను అదుపులోకి తీసుకోగా చాంద్ పాషా పరారైనట్లు తెలుస్తోంది. ఆశోక్ రావుతో పాటు కమర్‌ను విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా చాంద్ పాషా పరారీలో ఉన్నడని ప్రచారంతో పాటు హైదరాబాదులో వారి బంధువుల శుభకార్యానికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. కొందరు గల్ఫ్ ఏజెంట్లు, ట్రావెల్స్ యజమానుల గుండెలలో రైలు పురుగులు తీయడంతో పాటు వారి కార్యాలయాలను మూసివేసుకున్నారు. సీబీఐ అధికారులు కోరుట్ల నుంచి వెళ్లిపోయ్యారన్న సమాచారంతో వారు ఉపిరి పీల్చుకున్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి, జనవరి, 19: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌ల్లో విలేకరుల సమావేశంలో ఆయన ఎస్సై చిరంజీవితో కలిసి మాట్లాడారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ హైదర్, నిజామాబాద్ జిల్లా మోర్తడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్‌కు ఆరు నెలల క్రితం జైల్లో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. రెండు నెలల క్రితం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సాయిబాబ ఆలయంలోని హుండీ, 15 రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని ఎల్లమ్మ గుడిలోని హుండీ, ఇబ్రహీంపట్నంలోని గోదురులోని పోచమ్మ, హనుమాన్ ఆలయాల్లోని హుండీ పగలగొట్టి బంగారం, వెండి అభరణాలు చోరీ చేశారు. కోరుట్ల మండలంలోని ధర్మారంలోని రామాలయంలోని హుండీ పగలగొట్టి నగదు దోచుకున్నారు. మూడు రోజుల క్రితం మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్క, ఆత్మనగర్ గ్రామాల్లోని ఆలయాల్లోని బంగారం, వెండి, హుండీలను ఎత్తుకెళ్లారు. వారిని మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో వారిని పట్టుకొని ద్విచక్ర వాహనం, 14 తులాల వెండి, రూ. 9 వేలు, తాళాలు పగల గొట్టే కొంకిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు కానిస్టేబుల్ కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించి రివార్డులను అందజేశారు.

ఆలయాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని ఆందోళన

- అధికారుల చర్చలతో సద్దుమణిగిన గొడవ



ఆందోళన చేస్తున్న తిమ్మాపూర్ గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జనవరి 19: ఆలయాలకు రహదారితో పాటు ఆలయానికి సంబంధించిన భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తు శుక్ర వారం తిమ్మాపూర్ గ్రామస్థులు పెద్దమ్మ ఆలయం వద్ద రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ శివారులోని గ్రామ దేవతలైన పోచమ్మతో పాటు వివిధ ఆలయాలకు వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని అక్కడకు వెళ్లేందుకు రహదారి ఇస్తానని చెప్పి ఇప్పుడు ఇవ్వకుండా వీడీసీ సభ్యులపైన పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాదాపుగా మూడు గంటల పాటు మహిళలు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎస్‌ఐ ఉమాసాగర్ అక్కడకు చేరుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో సంఘ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబ సభ్యులను పిలిపించారు. అక్కడకు చేరుకుని ఇరువురు చర్చలు జరిపారు. ఆనంతరం ఇరువు రు శాంతించి ఆలయాలకు వెళ్లేందుకు నాలుగు ఫీట్ల రోడ్డును ఇవ్వడంతో పాటు వీడీసీ సభ్యులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.

కరీంనగర్ కార్పొరేటర్ కుల ధ్రువీకరణ పత్రం రద్దు

కరీంనగర్ టౌన్, జనవరి 19: నగరపాలక సంస్థ 6వ డివిజన్ కార్పొరేటర్ కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి (మున్నూరు కాపు) కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. 6వ డివిజన్ బీసీలకు కేటాయించగా కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి మున్నూరు కాపు కులధ్రువీకరణ పత్రంతో 2020లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆమె రెడ్డి ఓసీ వర్గానికి చెందినవారని, ఆమె సమర్పించిన బీసీ కులధ్రు వీక రణపై విచారణ జరిపి రద్దు చేయాలని కోరుతూ సాధవేని వినయ్‌కుమార్ అనే న్యాయవాది 2020లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ డిస్ట్రిక్ట్ లెవల్ స్క్రూటినీ కమిటీకి మాలతి సంపత్‌రెడ్డి కులధ్రువీకరణ పత్రాన్ని పంపించి విచారణకు ఆదేశించారు. దీనిపై విచారించిన డిఎల్ఎస్‌సి మాలతి సమర్పించిన బీసీ డీ కులధ్రువీకరణ రద్దు చేసింది. దీనితో మాలతిసంపత్ కోర్టును ఆశ్రయించడంతో పాటు ప్రభుత్వానికి కూడా అప్పీలు చేసుకోవడంతో తిరిగి విచారణ జరిపారు. డిఎల్ఎస్‌సి ఇచ్చిన నివేదిక మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ 30రోజుల్లో అప్పీలు చేసుకోవాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చదరంగ పోటీలు ప్రారంభం

- 11 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు రాక
- 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు హాజరు



చెస్ ఆడుతున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: అఖిలభారత ఫిడె రేటింగ్ అండర్-1,600 చదరంగ పోటీలు జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ తొలిఎత్తువేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధస్సును పెంపొందించే క్రీడా చదరంగం అని అన్నారు. చిన్నారులు చదరంగా క్రీడను నేర్చుకోవడంతో వారికి జ్ఞాపక శక్తి పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా విద్యార్థులు చదువులో రాణిస్తారని, మంచి క్రమశిక్షణ అవడుతుందన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారిగా అండర్-1,600 ఫిడె చదరంగ పోటీలను కరీంనగర్ వైశ్యభవన్ వేదికగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారుడు విశ్వనాథ్ అకాడమీ కోచ్ అంతగిరి విశ్వనాథ్ మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రొత్సహించే ఉద్దేశ్యంతో జాతీయ, అంతర్జాతీయ చదరంగ క్రీడాపోటీలను ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల అభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో దేశంలోని 11 రాష్ట్రాలనుంచి 300 మంది చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు ఉన్నారని వివరించారు. మొదటిరోజు నిర్వహించిన 3 రౌండ్ల పోటీల్లో కన్నం విశ్వనాథ్, అరగొండ మోహన్, సి పవన్, బి మహేందర్, గౌరిచందర్ ముందంజలో ఉన్నారని, పోటీల ఆర్బిటర్ సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, అకాడమి కోచ్ కొప్పర్తి శివయ్య, కె జగన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ

భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యం

● బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్న రైతులు ● సర్వే నిలిపివేసి వెనుదిరిగిన అధికారులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 19: వ్యవసాయం చేసుకుంటూ ఉన్న భూములను తీసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ఆందోళనకు దిగారు. శుక్రవారం గ్రామ శివారులో అధికారులు సర్వే చేస్తుండగా విషయం తెలుసుకున్న వెల్లుల, బండ లింగాపూర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు సంఘటన స్థలానికి వచ్చి బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్నారు. విషయం తెలుసు కున్న మెట్‌పల్లి ఆర్డీవో మధు, తహసీల్దార్ శేఖర్ సంఘటన స్థలానికి వచ్చారు. భూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తాము విలువైన భూములను ఇవ్వమని గతంలోనే చెప్పామని రైతులు పేర్కొన్నారు. రహదారి కోసం భూములు తీసుకుంటే ఉన్న జీవనోపాధి కోల్పోయి పని లేక ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు భూ పరిధిని బట్టి నష్టపరిహారం నిర్ణయిస్తారని, భూ సర్వే చేయనివ్వాలని ఆర్డీవో కోరినా రైతులు వినకుండా సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక అధికా రులు సర్వేను నిలిపి వెనుదిరిగారు.



మెడిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధు

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 7,105 మంది విద్యార్థులు

చొప్పదండి జనవరి 19: జాతీయ స్థాయిలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే జవహర్ నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, 7,105 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకరావాలని, అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

● 4 బ్లాకులలో..

నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏడు జిల్లాల పరిధిలోని 14 బ్లాకులలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు, జగిత్యాలలో 11, సిరిసిల్లలో 5, పెద్దపల్లిలో 5, జయశంకర్ భూపాలపల్లి పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో, సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో, హను మకొండ పరిధిలోని ముల్కనూరులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యా ర్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే 9490395216, 9966759402, 988 5101327 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

'ఖని'లో సైబర్ నేరస్థుల పంజా

- ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలు ఖాళీ
- ఖాతాదారులకు సంబంధం లేకుండా బయట రాష్ట్రాల్లో డబ్బులు విత్‌డ్రా
- గోదావరిఖని వన్‌టౌన్‌లోనే 43కేసులు

కోల్‌సిటీ, జనవరి 19: గోదావరిఖనిలో సైబర్ నేరస్థులు పంజా విసురుతున్నారు. ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఖాతాదారులకు సంబంధం లేకుండానే, వారు ఎలాంటి ఫోన్ వాడకుండానే, లింకులు ఓపెన్ చేయకుండానే రోజుకు రూ.10వేల చొప్పున బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఖాళీ అవుతుంది. బయటి రాష్ట్రాల్లో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) ద్వారా బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేసి డబ్బులు విత్‌డ్రా చేసుకున్నట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. బ్యాంకుల్లోకి వెళితే పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, డిల్లీ కేంద్రంగా మినీ ఏటీఎంలలో డబ్బులు డ్రా అయినట్లు గుర్తించారు. బాధితులు అలర్ట్ అయ్యేలోగానే వారి ఖాతాల నుంచి మళ్లింపబడిన సొమ్మును సైబర్ నేరస్థులు డ్రా చేసుకుంటున్నారు. గోదావరిఖని పట్టణంలోనే రెండు నెలల వ్యవధిలో వందల సంఖ్యలో ఈ విధంగా అకౌంట్లను కొల్లగొడుతున్నారు. బాధితులు అలర్ట్ అయి సైబర్ పోర్టల్‌లో 1930 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేసి అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలా ఫ్రీజ్ అయినవే 43నమోదు అయ్యాయి. ఇక సొమ్ములు పోగొట్టుకున్నవి వందల సంఖ్యలో ఉంటున్నాయి.

● రంగంలోకి సైబర్ క్రైమ్

గోదావరిఖని పట్టణంలోనే ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్ అప్రమత్తమయ్యింది. దీనికి సంబంధించి విచారణ ప్రారంభించింది. గోదావరిఖనిలో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) సిస్టంతో డబ్బులు పోగొట్టుకున్న బాధితులంతా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా బయోమెట్రిక్ వేలిముద్రలు వేసిన వారే ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా కొనుగోలు, అమ్మకాలు చేసిన వారు, సాక్షులుగా ఉన్న వారు బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేశారు. వీరి డాటా హ్యాక్ కావడం కానీ, చోరీ జరగడం కానీ అయి ఉంటుందని భావిస్తున్నారు. ఈ దిశగా విచారణ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం తమ సైబర్ సెక్యూరిటీ సిస్టం పటిష్టమైందని, చోరీచేసే అవకాశాలు లేవంటూ పేర్కొంటున్నారు. దీంతో హైదరాబాద్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సంప్రదించే పనిలో ఉన్నారు.



గ్రూప్స్ శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, జనవరి 19: కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.in లో ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ కోసం డిగ్రీ అర్హత కలిగిన కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగయువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబవార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్ కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్ కార్డ్, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 0878-228686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనము కరీంనగర్ కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల విజయ్, ప్రదీప్‌కుమార్, సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గండ దీపంలో నూనె పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో కూడా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరో హితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మతిస్థిమితం కోల్పోయి మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, జనవరి 19: మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో మతిస్థిమితం కోల్పోయి ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెర్లుమద్దికి చెందిన తోవెటి లక్ష్మి(55) మతి స్థిమితం కోల్పోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీ కుమారుడు కార్తీక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపిరి ఆడక వ్యవసాయ కూలీ మృతి

వీణవంక, జనవరి 19: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన డుకిరె రాజు (32) అనే వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరి ఆడక శుక్రవారం మృతి చెందాడు. పోలీస్‌లు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమ్మత్‌నగర్‌కు చెందిన రాజు ఉదయం వరి నారు మోసేందుకు కూలీ పనికి వెళ్లాడు. నారు నెత్తిన పెట్టుకొని నడుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి వంశీకృష్ణ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెద్దపల్లిటౌన్, జనవరి 19: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో నిర్వహిస్తున్న వ్యభిచారం గృహంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. పట్టణానికి చెందిన ఓ మహిళ చీకురాయి రోడ్డులో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచార స్థావరం నిర్వహిస్తుందన్న పక్కా సమాచారంతో దాడి చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు మహిళలను సఖి కేంద్రానికి తరలించినట్లు, స్థావరం నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 19: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 61మంది రైతులు 538క్వింటాళ్లు విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 1,080క్వింటాళ్ల పత్తిని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసింది.

జిల్లా క్రికెటర్లు భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలి

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: జిల్లాలో క్రికెట్‌లో రాణించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని, భవిష్యత్‌లో జిల్లాకు చెందిన క్రికెటర్లు రంజీ, భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూనిటీ కప్ 2024, క్రికెట్ లీగ్ పోటీలు శుక్రవారం నాటికి క్వార్టర్స్ ఫైనల్ దశకు చేరుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం స్టేడియంలో జరిగిన మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏ, బీసీసీఐలను కోరనున్నట్లు తెలిపారు. క్రికెట్‌లో ఉన్న ఆసక్తిని బట్టి జిల్లాలో క్రికెట్ అకాడమీలను నెలకొల్పడానికి హెచ్‌సీఏ ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించిన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రికెటర్లను వెలుగులోకి తీసుకొస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ మ్యాచ్‌లు అత్యంత హోరాహోరీగా జరుగుతున్నాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు భారీ ప్రైజ్‌మనీని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, క్రికెట్ కోచ్ కన్నన్, నిర్వాహకులు సురేష్, మహర్షి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, జనవరి 19 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలైన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల అంచనా విలువతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని శుక్రవారం జడ్పీచైర్ పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం ఒకవైపు, అభివృద్ధి మరోవైపు లక్ష్యంగా పని చేస్తోందన్నారు. మొట్టమొదటిసారిగా చందుర్తి మండల జడ్పీటీసీగా గెలుపొందినప్పుడు రామన్నపేట గ్రామం తనకు మంచి మెజార్టీని ఇచ్చిందన్నారు. రామన్నపేటలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపు కుంటామన్నారు. త్వరలోనే చందుర్తి నుంచి మోత్కురావుపేట రోడ్డు పనులు పూర్తి అవుతాయన్నారు. నూతనంగా గ్రామ పంచాయతీ భవనం నిర్మించుకున్నందున పంచాయతీ పాలకవర్గాన్ని ఆది శ్రీనివాస్ అభినందించారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. గ్రామాల్లో ఎక్కడ చెత్తా చెదారం లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. గ్రామానికి చేసిన సేవలను ప్రజలు ఎల్లవేళలా గుర్తుంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుమ్ము అంజయ్య, జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఎంపీటీసీ వేల్పుల వనజ దేవస్థానం, ఎంపీవో ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఉప సర్పంచ్ భూలక్ష్మి, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, భీమరాజు కళ్యాణి కనకరాజు, చింతపంటి రామస్వామి, రాంరెడ్డి, మోహన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, జనవరి 19: మాదక ద్రవ్యాలను విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీచైతన్య, వికాస్ విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను నిర్మూలించేది నేటి తరం విద్యార్థులేనన్నారు. విద్యార్థుల దృష్టి తమ కేరీర్ మీద మాత్రమే ఉండాలని, నిషేధిత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు అలవాటు పడవద్దన్నారు. డ్రగ్స్ వాడకం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అనేక విధాలుగా పాడు చేస్తుందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు, అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి యాంటీ డ్రగ్స్ క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారంపై డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. యాంటీ డ్రగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణ మీద స్లోగన్ కాంపిటేషన్, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహిస్తామని, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేశ్, టౌన్ సీఐ రఘుపతి, ఎస్సై రాజు, పాఠశాల, కళాశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎల్లారెడ్డిపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డీఐఈవో మోహన్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై రమాకాంత్

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎస్సై సుధాకర్, హెసీలు పాల్గొన్నారు.

కోనరావుపేట: డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కోనరావుపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆంటీ డ్రగ్స్ క్లబ్ ప్రోగ్రాంలో భాగంగా డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించే నిమిత్తంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

బాకురుపల్లితండాలో ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, జనవరి 19: ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లితండాలో మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు సత్యనారాయణస్వామి, అభినయ్ నేతృత్వంలోని వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని సర్పంచ్ మంజుల అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యశ్వంత్, నాయకులు రాజునాయక్, తిరుపతి, రాజు, గేనవ్వ, శీలవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల సాధనలో టీపీటీఎఫ్ కీలక పాత్ర

సిరిసిల్ల రూరల్, జనవరి 19 : ఉపాధ్యాయుల హక్కుల సాధనలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఉపాధ్యాయ సంఘం పాత్ర గొప్పదని ఎంఈవో దూస రఘుపతి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శుక్రవారం టీపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బూస రాజేందర్, మైలారం తిరుపతి, హెచ్ఎం లోకిని శారద, నాయకులు రాంబాబు, శ్రీనివాస్, రవిబాబు, రమేష్,సతీష్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, రాజలింగం, ప్రకాష్‌రావు, అనూరాధ, రాధారాణి, వసంత, విజయలక్ష్మీ, రజని తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, జనవరి 19 : సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను అఖిల భారత రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాకాల శంకర్‌గౌడ్, గుండమనేని మహేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, కోశాధికారి పరకాల రవీందర్, జంగిటి రాజు, పాముల స్వామి, శివకుమార్, ఎలగోండ రవి, వంగ మల్లేశం, కిరణ్,శంకర్, వెంకటేష్, లక్ష్మణ్, పోలాస మల్లేశం, సతీస్, బాలరాజు, మధుసూధన్, నారాయణ, రామకృష్ణ, పీజీ హెచ్ఎం అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోతిలాల్, పేట జిల్లా అధ్యక్షుడు దేవత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

చందుర్తి, జనవరి 19 : చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి అయోధ్య శ్రీరాముడి అక్షింతలు శుక్రవారం చేరుకున్నాయి. సర్పంచ్ అంబిరి కల్పన - నరేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి అయోధ్య అక్షింతలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉగిలే శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు బాణాల గంగారెడ్డి, కొమ్ము రమేష్, నాయకులు వంకాయల కార్తీక్, పోవారి గణేష్, పవన్, బోర్‌గాయ ప్రసాద్, నాగిరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

ఎగువమానేరుకు నీటిని విడుదల చేయాలి

ముస్తాబాద్, జనవరి 19 : ఎగువమానేరుకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బుర్ర రాములుగౌడ్, మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఒరగంటి తిరుపతి, మిరుదొడ్డి దేవేందర్ శుక్రవారం కలిశారు. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మూడు మండలాల వరప్రదాయని ఎగువమానేరుకు మల్లన్న సాగర్ నుంచి నీటి విడుదల చేయాలని విన్నవించారు. 18వ కాలువ వరకు కాకుండా తెర్లుమద్ది 21,22 కాలువ వరకు సాగు నీటిని విడుదల చేయాలన్నారు. చెరువులు నింపేలా చూడాలని కోరారు.

వెంకట్రావుపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

కోనరావుపేట, జనవరి 19 : కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ గ్రామ కమిటీని ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా జర్రీగ వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా మంథని నరేష్, మానుక మహేష్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి తిరుపతి, కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా భూమయ్య, కార్యవర్గ సభ్యులుగా మాధవ రెడ్డి, మల్లేశం, రవి ఎన్నికయ్యారు.

గ్రామపంచాయతీ నిధుల వివరాలు తెలపాలి

కోనరావుపేట, జనవరి 19 : మండలంలోని కనగర్తి గ్రామపంచాయతీ నిధుల ఖర్చుల వివరాలు తెలపాలని ఎంపీడీవో రామకృష్ణకు గ్రామానికి చెందిన చేపూరి అజయ్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, చేసిన ఖర్చుల వివరాలు తెలపాలని ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

చందుర్తి, జనవరి 19 : చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లల్లో సైన్స్ పట్ల అభిరుచి పెంచడానికి జన విజ్ఞాన వేదిక ఏటా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్షలు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించబడి సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవడానికి దోహదపడుతాయన్నారు. ఈ నెల 22న నిర్వహించనున్న చెకుముకి సైన్స్ పాఠశాల స్థాయి టాలెంట్ పరీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్, జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు విక్కుర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ అనిల్ సేవలు చిరస్మరణీయం



అనిల్ విగ్రహానికి పూలమాల వేస్తున్నఎమ్మెల్యే

బోయినపల్లి, జనవరి 19: దేశం కోసం దివంగత ఆర్మీ జవాన్ అనిల్ సేవలు చిరస్మరణీయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. అనిల్ స్వగ్రామమైన బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో అనిల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన అనిల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, కార్యదర్శి కట్ట లచ్చయ్య, మండల శాఖ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, తడగొండ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ శ్రీకాంత్‌నాయక్, అనిల్ పాల్గొన్నారు.

మహిళల భద్రతే మా బాధ్యత : ఎస్పీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 19: జిల్లాలోని మహిళలు, విద్యార్థినుల భద్రత లక్ష్యంగా తాము బాధ్యతలు నిర్వర్తిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మహిళ భద్రత షీ టీం లక్ష్యం' కార్యక్రమానికి శిక్షణ ఐపీఎస్ రాహుల్‌రెడ్డితో కలిసి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, బాలికలు, యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు షీ టీం పని చేస్తోందన్నారు. కళాశాలలు, బస్టాండ్ ప్రాంతాల్లో మఫ్టీలో ఉండి పోకిరీలను పట్టుకుని చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల రక్షణే ముఖ్యంగా పోలీసు శాఖ ముందుకు సాగుతోందన్నారు. జిల్లాలో విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు 'ఆపరేషన్ జ్వాల' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, శిక్షణ కల్పిస్తున్నామని అన్నారు. అభయ యాప్, బస్‌లో భరోసా కార్యక్రమాలను చేపట్టి ధైర్యం నింపుతున్నామన్నారు. మైనర్లపై అఘాయిత్యాలకు ఒడిగట్టిన వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా వేధించిన, అవహేళన చేసిన వెంటనే 100, జిల్లా షీ టీం సెల్ ఫోన్ నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేస్తే క్షణాల్లో చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దన్నారు. విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్, షీ టీం ఎస్సై ప్రమీల, సిబ్బంది ప్రియాంక, రమాదేవి, శ్రీధర్, పాఠశాల హెచ్ఎం హన్మండ్లు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

టీజేఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కనకయ్య, నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 18 : రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వ వివక్షతపై టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో రాష్ట్ర విభజన హామీల అమలు - కేంద్ర ప్రభుత్వ వివక్షతపై రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను టీజేఎస్ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన లక్ష్యంగా టీజేఎస్ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, మంత్రులకు టీజేఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసిన పది సంవత్సరాలుగా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీజేఎస్ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21న ఉదయం హైదరాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో టీజేఎస్ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాధనం దుర్వినియోగం చేసిందని, ధరణి తెలంగాణ రైతాంగానికి ఉరిగా మారిందని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడు కోవాలని తెలంగాణ బచావో నినాదంతో ఉద్యమించాలని అన్నారు. ఓటు అనే ఆయుధంతో నియంతృత్వ పాలకుడిపై ఉపయోగించి గద్దెదింపిన తెలంగాణ ప్రజలకు జేజేలు కొట్టాలన్నారు. టీజేఎస్ జిల్లా కమిటీ సభ్యులు గొట్టె రవివర్మ, బండ నాంపెల్లి, సుదర్శన్‌గౌడ్, రామకృష్ణ, కంకణాల అంజన్న, పెద్దన్న పాల్గొన్నారు.

ప్రతాప రామకృష్ణకు అభినందనల వెల్లువ



ప్రతాప రామకృష్ణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, జనవరి 19 : భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి నియామకమైన ప్రతాప రామకృష్ణను పలువురు బీజేపీ నాయకులు అభినందించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి బీజేపీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి ప్రతాప రామకృష్ణను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని, రానున్న రోజులలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, నాయకులు అన్నారం శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, రాపెల్లి శ్రీధర్, సగ్గు రాహుల్, అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్‌కు కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

సిరిసిల్ల టౌన్, జనవరి 19 : కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీలోని కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌కు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఉమ్మడి సిరిసిల్ల నియోజకవర్గం మాజీ శాసన సభ్యుడు ఎర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలని కర్రోళ్ల నర్సయ్య స్మారక కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రోళ్ల నర్సయ్య స్మారక కమిటీ చైర్మన్ రాగుల రాములు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కర్రోళ్ల నర్సయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, మల్కపేట రిజర్వాయర్‌కు ఆయన పేరు పెట్టాలని ఆందోళనలను చేపట్టిన స్పందించలేదన్నారు. సిరిసిల్ల చంద్రంపేట చౌరస్తా వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నర్సయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, మల్కపేట రిజర్వాయర్‌కు ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేస్తూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో గ్రామ సంత ప్రారంభం

చందుర్తి, జనవరి 19: చందుర్తి మండలం లింగంపేటలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామీణ సంతను త్వరలో ప్రారంభించనున్నట్లు నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్వేత సింగ్ తెలిపారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు నాబారు ఆర్థిక సహకారంతో సేవ్స్ సెల్ఫ్ ఎంప్లాయిడ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో లింగంపేటలో నిర్మించిన గ్రామీణ సంతను శ్వేత సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్వేత సింగ్ మాట్లాడుతూ గ్రామీణ సంత నిర్మాణం నిమిత్తం నాబార్డు వారు రూ. 15 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. సర్పంచ్ లక్ష్మీ, నాబార్డ్ ఏజీఎం మనోహర్ రెడ్డి, నాబార్డ్ ఓఎఫ్ఎఫ్‌డీ డిపార్ట్మెంట్ కన్సల్టెంట్ విజయ్, సేవ్స్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతు



శ్రమదానం చేస్తున్న యువకులు

గంభీరావుపేట, జనవరి 19: గంభీరావుపేట మండలం కొత్తపల్లి రోడ్డును శ్రమదానంతో మరమ్మతు చేసుకున్నారు. కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి శివాజీనగర్ సరిహద్దు వరకు గుంతలు పూడ్చారు. ఈ రోడ్డు కోసం ఆందోళనలు, దీక్షలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో శ్రమదానానికి నడుం బిగించారు. శివసేన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు గౌట గణేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దూరు పర్శాగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పనులు చేపట్టారు. రోడ్డుపై గుంతల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తమ ఊరు రోడ్డును తామే బాగు చేసుకోవాలని నిర్ణయించినట్లు గౌట గణేష్, పెద్దూరు పర్శాగౌడ్ తెలిపారు. ఎన్నికల సమయంలో పాలకులు రోడ్డు మంజూరైందని శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి, ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదన్నారు. శివసేన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడి గౌట గణేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దూరు పర్శాగౌడ్, నాయకులు మల్లేశం, రాజుగౌడ్, శంకర్, మహేందర్, రాజేశ్, సంజీవ్ రాజనర్సు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ, మాజీ కౌన్సిలర్



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీటీసీ రేణుక

సిరిసిల్ల టౌన్, జనవరి 19 : సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శుక్రవారం జడ్పీటీసీ పూర్మాణి మంజులలింగారెడ్డి ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం చీర్లవంచ ఎంపీటీసీ నలువాల రేణుక జలందర్ దాదాపు 40 మందితో కలసి పార్టీలో చేరారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ బూట్ల రుక్మమ్మసుదర్శన్(బీఆర్ఎస్), పాలిస్టర్ ఉత్పత్తిదారుల సంఘం ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్, కోశాధికారి శ్రీరాం సత్యనారాయణ, డైరెక్టర్ కోడం అంబదాస్, పద్మశాలి సంఘం సిరిసిల్ల మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బూట్ల లతనవీన్, నాయకులు బూట్ల సుదర్శన్, బండారి అశోక్, నల్ల ప్రదీప్, వేముల వెంకటేశం, బొద్దుల శ్రీనివాస్, ఏనుగుల లక్ష్మణ్, ఎక్కలదేవి లింగమూర్తి కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ సీనియర్ నాయకుడు కోడం శ్రీనివాస్, అల్లె వేణు, గాజుల ఎల్లయ్య కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధానకార్యదర్శి కల్లూరి చందన, పద్మశాలి సంఘం సిరిసిల్ల అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, చంద్రకళ పాల్గొన్నారు.

కార్మికుల బతుకులను చీకటి చేసిన కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 19: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల బతుకులను చీకటి మయం చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్‌కి ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రాంతంపై ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఇక్కడి సమస్యలు గుర్తుకురాలేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాల తీయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో నేత పరిశ్రమ కుంటుపడేలా చేసి బతుకమ్మ చీరల పేరిట సిరిసిల్ల పద్మశాలీల బతుకులను ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు. బతుకమ్మ చీరల ఉత్పత్తితో కాటన్, పాలిస్టర్ పరిశ్రమ, డైయింగ్, సైజింగ్, ఇతర అనుబంధ సంస్థలు కుంటుపడిపోయాయన్నారు. బతుకమ్మ చీరల వచ్చాక సిరిసిల్లలో మాక్స్ సొసైటీలు, ఎస్ఎస్ఐలు పుట్టుకొచ్చాయన్నారు. మరమగ్గాలు లేనివారికి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి కమిషన్లకు కక్కుర్తి పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ, మున్సిపల్, జౌళిశాఖల మంత్రి అయి కూడా అన్ని శాఖలను ఏలిన కేటీఆర్ బతుకమ్మ చీరల బిల్లు ఇవ్వడం మరిచారన్నారు. మున్సిపల్ శాఖ వారు రూ.160 కోట్ల ఎలక్ట్రిసిటీకి బకాయి ఉందని సిరిసిల్ల మున్సిపాల్ కరెంటు బిల్లులు కట్టక పోతే సెస్ అధికారులు కరెంట్ తొలగించిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రభుత్వ పాఠశాల లో బిల్లులు కట్టక పోతే కరెంట్‌ను తొలగించారన్నారు. సిరిసిల్లలో ఎంత మంది కార్మికులు ఉన్నారో కూడా ఎంపీకి తెలియదని ఎద్దేవా చేశారు. జీఎస్టీ పరిధిలోకి నూలును తీసుకొచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వాని దేనన్నారు. నూలుపై జీఎస్టీ మినహాయిస్తే బాగుపడ తారని ఎంపీకి ఆరోజు సోయి లేదని అన్నారు. ఇప్పుడు వచ్చి కాంగ్రెస్ విధానాలతో పరిశ్రమ మూతపడింద నడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయని బండి సంజయ్‌కి సిరిసిల్ల గుర్తుకొచ్చినట్లు ఉందన్నారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, జిల్లా మహిల అధ్యక్షురాలు వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, పద్మశాలి సంఘం సిరిసిల్ల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, చంద్రకళ పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులను ఐక్యం చేద్దాం



సిరిసిల్లలో మాట్లాడుతున్న నర్సయ్య

సిరిసిల్ల రూరల్, జనవరి 19 : కార్మికులు, కర్షకులను ఐక్యం చేద్దామని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లతో తీర్పు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య కోరారు. కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అఖిల భారత కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ముఖ్యనాయకులతో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నర్సయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కార్పొరేట్, మతోన్మాద విధానాలతో దేశంలోని కార్మిక వర్గం, రైతాంగం, పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాతీయ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, కార్యదర్శి ముక్తికాంత్ అశోక్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, మోర తిరుపతి, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.